## క్లుప్తంగా

### అభినందన



**మాచర్ల:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు, స్టేట్ స్పోర్ట్స్ విభాగ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని సోమవారం విజయవాడలో వైఎస్సార్ సీపీ మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిద్ధార్థరెడ్డిని సత్కరించారు. వెంట్రామిరెడ్డి వెంట పురపాలక సంఘ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను, నియోజకవర్గ యువజన నాయకులు పలువురు ఉన్నారు.

### విద్యార్థులకు ప్లేట్లు, పుస్తకాలు పంపిణీ



**మాచర్ల రూరల్:** కొత్తపల్లి గ్రామంలోని ఎంపీపీ, ఆర్‌సీఎం పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు మాజీ సర్పంచ్ అల్లం రామిరెడ్డి జ్ఞాపకార్థం ప్లేట్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం పిచ్చయ్య, నాసరయ్య తెలిపారు. తండ్రి రామిరెడ్డి జ్ఞాపకార్థం ఏటా పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలలకు ఇలాంటి అవసరమైన వస్తువులను అందిస్తున్న అల్లం కోటిరెడ్డి సేవలు అమూల్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్లం రామ్మోహనరెడ్డి, విజయలక్ష్మి, శ్రావణి, డాక్టర్ అల్లం రమ్య, సిస్టర్ కె.రోజారాణి, ఉపాధ్యాయులు శివపార్వతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం



**మాచర్ల:** పట్టణంలోని రామాటాకీస్ లైన్‌లో డాక్టర్ అంజిరెడ్డి మల్టీ ఆస్పత్రిలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు వైద్యుల ఆధ్వర్యంలో 93 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు వెంకటేష్, రజిత, నరేంద్రల ఆధ్వర్యంలో చికిత్స, మందులు అందించారు. అనంతరం పలు వ్యాధులపై అవగాహన కల్పించారు.

### శ్రీలక్ష్మీ అమ్మవారికి కుంకుమ బండి



**కారెంపూడి:** మండలంలోని మిరియాల గ్రామంలో శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారికి ఆదివారం ఉత్సవం నిర్వహించారు. రాత్రి అమ్మవారికి కుంకుమ బండి కట్టి గ్రామోత్సవం చేశారు. అమ్మవారి కుంకుమ బండిని పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఆరికట్ల లింగారెడ్డి, ముత్తన కోటిరెడ్డి, లంకె సీతారామరాజు, మేకల మురళీధరరెడ్డి తదితరులు అమ్మవారికి కుంకుమ బండి కట్టారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి నల్లగురవారెడ్డి, ఉప సర్పంచ్ దారెడ్డి ప్రభాకరరెడ్డి, అలవాల రాజశేఖరరెడ్డి, ఊటా రాజశేఖరరెడ్డి, అల్లం శ్రీనివాసరెడ్డితోపాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఉత్సవానికి విచ్చేసిన వెంకట్రామిరెడ్డిని గ్రామ నేతలు సన్మానించారు.

### వేగంగా ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ



**దాచేపల్లి :** తంగెడ గ్రామ సచివాలయంలో ఆధార్‌కార్డు అప్‌డేట్, ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను సోమవారం చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వార్డు, గ్రామ సచివాలయాల్లో ఆధార్‌కార్డు అప్‌డేట్, ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. పుట్టిన దగ్గర నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు, ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పుల ప్రక్రియను సచివాలయాల్లో నమోదు చేస్తున్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఆధార్‌కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం చెప్పారు.

# విజయీభవన్

**వేగంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం**



గురజాలలో నిర్మాణం చేపడుతున్న రైతు భరోసా కేంద్రం

**గురజాల:** ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలు నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్నాయి. నాలుగు మండలాల్లో 54 గ్రామ సచివాలయాలకు గాను 42 భవనాలు పూర్తయ్యాయి. 12 భవనాలు పలు దశల్లో ఉన్నాయి. అలాగే విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 27 నిర్మాణాలు జరగ్గా 44 నిర్మించాల్సి ఉన్నది. 43 రైతు భరోసా కేంద్రాలకు 26 భవనాలు పూర్తి కాగా 17 భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. గ్రామ సచివాలయాలకు ఒక్కొక్క భవనానికి రూ.40 లక్షలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు ఒక్కొక్క భవనానికి రూ.17.50 లక్షలు, రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకేల)కు ఒక్కొక్క భవనానికి రూ.21.8 లక్షలు కేటాయించారు. ఆర్‌బీకేల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 90 శాతం, వ్యవసాయ శాఖ ద్వారా 10శాతం మంజూరు చేశారు.

**వేగంగా పనులు జరుగుతున్నాయి**



గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ప్రజలకు అవసరమైన ప్రతి ప్రభుత్వ భవనం సొంత భవనాల్లో ఉండేలా సర్కారు చర్యలు చేపట్టింది. ప్రజల వద్దకు పాలనను చేరువ చేయాలనే లక్ష్యంతో భవనాల నిర్మాణం జరుగుతోంది. అన్ని భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేస్తాం.

– ముత్తయ్య, పంచాయతీ రాజ్ డీఈ, గురజాల

**నియోజకవర్గంలో ప్రాధాన్య భవనాల నిర్మాణం ఇలా..**

| మండలం | సచివాలయాలు | | ఆర్‌బీకేలు | | విలేజ్ హెల్త్ క్లినిక్ | |
|---|---|---|---|---|---|---|
| | మొత్తం | నిర్మించినవి | మొత్తం | నిర్మించినవి | మొత్తం | నిర్మించినవి |
| గురజాల | 14 | 09 | 11 | 03 | 11 | 05 |
| దాచేపల్లి | 11 | 09 | 05 | 03 | 08 | 04 |
| మాచవరం | 15 | 11 | 13 | 10 | 12 | 10 |
| పిడుగురాళ్ల | 14 | 13 | 14 | 10 | 13 | 08 |

## పేదలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



చెన్నాయపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసాద్

**మాచవరం:** గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్ చెప్పారు. మండలంలోని చెన్నాయపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందించారు. దీర్ఘకాలిక రోగులను ఇంటి వద్దనే కలుసుకుని, వారికి అందుతున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. 104 సిబ్బంది ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్ర స్థాయిలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తిరునాళ్లను విజయవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో ఎంపీపీ, అధికారులు

**శావల్యాపురం:** బొందిలిపాలెంలో వేంచేసిఉన్న అడవి పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్లను ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని దేవాలయ కార్యనిర్వహణాధికారి పి.వెంకటరెడ్డి కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న ఉగాది పర్వదినం రోజున జరగనున్న తిరునాళ్లకు వేల సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే ఉదయం 12 గంటల వరకు మాత్రమే వాహనాలు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ గల్లా రవికృష్ణ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు మూడు పార్కింగ్ స్థలాలు కేటాయించామని చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం మాట్లాడుతూ తిరునాళ్లలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడాల వీరాంజనేయులు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు మోడల్ పేపర్లను అందజేస్తున్న కార్డ్స్ సంస్థ సిబ్బంది

**పిడుగురాళ్ల:** ఉన్నత శిఖరాలు అధిరోహించడం విద్యతోనే సాధ్యమని మాజీ ఏపీజీ ఎ.రూత్ బెనియన్ చెప్పారు. పట్టణంలోని లెనిన్‌నగర్‌లో కార్డ్స్ సంస్థ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూత్ బెనియన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దళితులు, ఆదివాసులు, పేద వర్గాలు అభివృద్ధి చెందేందుకు విద్య చాలా ఉపయోగపడుతుందని, పిల్లలు కష్టపడి విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని పేర్కొన్నారు. కార్డ్స్ సంస్థ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు, బాలిక విద్య కోసం కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి పి.లత అధ్యక్షత వహించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ మోడల్ పేపర్‌ను రూత్ బెనియన్, టి.అమరనాథ్ చేతల మీదుగా నాలుగో తరగతి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కార్డ్స్ సంస్థ డెప్యూటీ డైరెక్టర్ టి.అమర్‌నాథ్‌తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు దయామణి, సునిత, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ‘స్పందన’కు అధికారుల డుమ్మా



స్పందన కార్యక్రమానికి అధికారుల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

**మాచర్ల రూరల్:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి స్థానిక అధికారులు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులూ విధిగా హాజరుకావాలి. అయితే ఇద్దరు, ముగ్గురు తప్పితే ఎవరూ హాజరు కావటం లేదు. కొంతమంది అధికారులు మాత్రం రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి పత్తా లేకుండా పోతున్నారు. సుమారు 15 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా సోమవారం కేవలం ఎంపీడీఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మాత్రమే హాజరయ్యారు. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చదువును బాధ్యతగా భావించాలి

**రెంటచింతల:** ప్రతి విద్యార్థి చదువును బాధ్యతగా భావించాలని, తెలుగుమీడియం అని చిన్నచూపు వద్దని, ఎందరో తెలుగు మీడియం చదివినవారు ఉన్నత శిఖరాలను చేరుకున్నారని ఎంఈఓ ఐ.వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం స్థానిక వైఆర్‌ఎస్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో 10వ తరగతిలో పట్టు సాధించడం వల్లే భవితకు బాట పడుతుందన్న విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకావద్దని, ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం హోరెత్తింది. స్కూల్ కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య అందజేసిన దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు హెచ్‌ఎం కె.చంద్రం రూ.1,116, పల్నాటి శ్రీనివాసరావు రూ.2,116 అందజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు గుండా వెంకటేశ్వర్లు, నాళం బాబు, చంద్రశేఖరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### టీడీపీ ఎమ్మెల్యేల తీరు హేయం

**మాచర్ల:** శాసన సభలో సోమవారం స్పీకర్‌తోపాటు మరో దళిత ఎమ్మెల్యేపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడికి పాల్పడడం అత్యంత హేయమని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం వారు మార్కెట్ యార్డులో విలేకరులతో మాట్లాడారు. శాసన సభలో దాడులు చేసే స్థాయికి టీడీపీ దిగజారడం బాధాకరమన్నారు. ప్రజల అభిమానాన్ని పొందలేక ఏదో విధంగా అధికారం చేజిక్కించుకోవటం కోసం మాజీ సీఎం చంద్రబాబు, నారా లోకేష్ నాటకాలాడుతూ అసెంబ్లీలో రచ్చ సృష్టిస్తున్నారని విమర్శించారు. టీడీపీ ఎమ్మెల్యేలు రౌడీల్లా ప్రవర్తించడం దారుణమని పేర్కొన్నారు.

### రేపు పూర్వ విద్యార్థుల సమావేశం

**ముప్పాళ్ల:** ఈ నెల 22వ తేదీన ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం జరుగుతుందని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సోమవారం తెలిపింది. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులంతా హాజరుకావాలని కోరింది. పాఠశాలలో చేపట్టిన నూతన భవన నిర్మాణంపై చర్చ జరుగుతుందని పేర్కొంది.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**దాచేపల్లి :** ఆగిఉన్న లారీని మరో లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం జరిగింది. గామాలపాడు సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి అతివేగంతో వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. దీంతో ఢీకొట్టిన లారీ డ్రైవర్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరిఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

### ముగిసిన వేలం పాటలు

**మాచర్ల:** పట్టణంలోని ఎస్‌ఈబీ స్టేషన్ (ఎక్సైజ్) పరిధిలో సోమవారం వేలం పాటలు నిర్వహించారు. గతంలో సిబ్బంది దాడుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలం పాటదారులు పాల్గొని ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు పాడుకున్నారు. ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు.

### నేడు నాగులుగుడి ఆలయంలో ప్రత్యేక పూజలు

**పిడుగురాళ్ల:** నాగులు గుడిలో అమావాస్య ప్రత్యేక పూజలు మంగళవారం నిర్వహించనున్నారు. అమావాస్య మంగళవారాన్ని పురస్కరించుకుని ఉదయం 8 గంటలకు మహాగణాధిపతి, కావడి పూజలు, కావడి ఆలయ ప్రదక్షిణ, 8.30 గంటలకు శ్రీ సంతాన సుబ్రహ్మణేశ్వర స్వామికి పంచామృతాలు, నవధాన్య చూర్ణములతో విశేష అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వెంకటేశ్వర్లు తెలిపారు.

### ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా



**పిడుగురాళ్ల:** అకాల వర్షాల వల్ల పట్టణంలో నీటి వసతి కరువైంది. దీంతో వెంటనే స్పందించిన 18వ వార్డు కౌన్సిలర్ జోగిపర్తి సుజాత, ముక్కంటి తన సొంత ఖర్చులతో వార్డు ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించారు. అంతేకాకుండా పక్కనే ఉన్న 17వ వార్డు ప్రజలకు కూడా నీటి సమస్య ఉందని తెలిసి వారికి కూడా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించారు. దీంతో ట్యాంకర్ల వద్ద నీటిని మహిళలు పట్టుకున్నారు.

## కుక్కల స్వైరవిహారం



రెంటచింతలలో సంచరిస్తున్న కుక్కలు

**రెంటచింతల:** రెంటచింతలలో కొద్దిరోజులుగా కుక్కలు స్వైర విహారం చేస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎక్కడెక్కడ నుంచో వచ్చిన సుమారు 6 నుంచి 10 ఊర కుక్కలు పగలురాత్రి అనే తేడా లేకుండా గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రేగుల మాన్యం, అంకమ్మనగర్, అంబేద్కర్ నగర్, ఆనందపేట, నాయుడుపేట కాలనీలలో కుక్కలు మూకుమ్మడిగా మీదకు ఎగబడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పాదచారులు, స్కూల్ చిన్నారులు, వృద్ధులను తిరగనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల సమీపంలోని పల్లపు పొలాల్లోనూ కుక్కలు విపరీతంగా తిరుగుతున్నాయని, పొలాలకు వెళ్లే కూలీలను భయపెడుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు వెంటనే స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అంధకారంలో పిడుగురాళ్ల



ఈదురుగాలికి కుప్పకూలిన విద్యుత్ స్తంభాలు



అకాల వర్షానికి నేలవాలిన వృక్షం

**పిడుగురాళ్ల:** పిడుగురాళ్ల పట్టణం ఆదివారం రాత్రి అంధకారంలోకి మగ్గింది. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. దీంతో పట్టణంలోని పెద్దపెద్ద వృక్షాలు నెలవాలాయి. 11 కేవీ విద్యుత్ లైన్ తీగలు తెగిపోయాయి. పట్టణ శివారులో విద్యుత్ స్తంభాలు కింద పడిపోవటంతో చుట్టుపక్కల గ్రామాలకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పట్టణంలోని బస్టాండ్‌లో పెద్ద చెట్టు ఆగి ఉన్న బస్సుపై పడింది. అందులో ప్రయాణికులెవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. శ్రీనివాస్ కాలనీలోనూ పెద్ద వృక్షం నెలవాలింది. పట్టణంలో ఆదివారం రాత్రి 8 గంటల నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

## పిచ్చుక జాతి సంరక్షణతోనే మానవ మనుగడ



పిచ్చుక బొమ్మలు వేసిన విద్యార్థులతో హెచ్‌ఎం గురులింగం, ఉపాధ్యాయులు

**నాదెండ్ల:** సెల్‌ఫోన్ టవర్ల రేడియేషన్, వాయు, శబ్ద కాలుష్యాల కారణంగా పిచ్చుక జాతి అంతరించే ప్రమాదంలో పడిందని హెచ్‌ఎం ఎ.గురులింగం ఆవేదన వ్యక్తం చేశారు. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అవనిగడ్డ హుస్సేనమ్మ యల్లమందయ్య ట్రస్ట్, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. పంట ధాన్యాలు తినేస్తున్నాయన్న కారణంగా గతంలో చైనాలో పిచ్చుకల సంహారాన్ని పెద్ద ఎత్తున చేశారన్నారు. రెండేళ్ల కాలంలోనే చీడపీడల ఉధృతితో చైనాలో ఆహార ధాన్యాల దిగుబడి పతనమై ఆహార సంక్షోభం తలెత్తిందన్నారు. దీంతో నాటి నుంచి పిచ్చుకల పరిరక్షణకు చైనా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పిచ్చుక, ఇతర పక్షి జాతుల మనుగడతోనే మానవ మనుగడ ఆధారపడిందన్న విషయాన్ని మరిచిపోరాదన్నారు. వేసవిలో పిచ్చుకల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లను ఏర్పాటు చేసి ధాన్యపు గింజలు ఉంచాలని కోరారు. అనంతరం విద్యార్థులు చిత్రించిన పిచ్చుకల బొమ్మలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశ్వరి శివకుమారి, వలంటీర్ మాణిక్యమ్మ పాల్గొన్నారు.

## నేటి నుంచి వర్క్ టు రూల్ బాటలో ఉద్యోగులు

**ఏపీజేఏసీ పల్నాడు జిల్లా చైర్మన్, యడ్లపాడు తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు**



తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

**యడ్లపాడు:** ఇకపై రెవెన్యూ ఉద్యోగులు వర్క్ టు రూల్ కింద ప్రభుత్వ పనివేళల్లోనే విధులు నిర్వహిస్తామని ఏపీఆర్ఎస్ఏ, ఏపీజేఏసీ పల్నాడు జిల్లా చైర్మన్, యడ్లపాడు తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై వీఆర్వోల సంఘం, కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల సమస్యల సాధనకు దశల వారీగా నిరసన కార్యక్రమాలకు కార్యాచరణ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభించామన్నారు. ఇప్పటికే విధుల్లో ఉన్న ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరిస్తున్నారన్నారు. మంగళవారం నుంచి ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యడ్లపాడు వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కేపీ చారి, కార్యదర్శి ప్రేమరాజ్, అన్ని గ్రామాల రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, సర్వే, పౌరుగు సేవల సిబ్బంది పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు..**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రమోటెడ్ వీఆర్వోలకు ప్రొహిబిషన్ డిక్లేర్ చేసి పేస్కేల్ అందించాలని సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సంఘం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### 24న వేలం

**దాచేపల్లి :** మిషన్ శోభకృత్-2023 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24న వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై.మహాలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపయోగంలో లేని పాత వాహనాలు, పాత ఇనుము, పాత ప్లాస్టిక్ సామగ్రి వేలం వేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు రూ.5వేలు డీడీ చెల్లించి వేలంలో పాల్గొన్నవచ్చునని వివరించారు.

### బియ్యం లోడు లారీ బోల్తా

**పిడుగురాళ్ల:** బియ్యంలోడు లారీ బోల్తా పడిన ఘటన పట్టణ సమీపంలోని అయ్యప్పనగర్ వద్ద సోమవారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం.. కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న బియ్యం లోడు లారీ అదుపు తప్పి అయ్యప్పనగర్ సమీపంలో బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. అతడిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని వెళ్లారు.

### నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

**ఈపూరు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 4 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు మండల కో–ఆర్డినేటర్ యు.రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసుకున్న యువతీ యువకులకు ఉచిత శిక్షణ, వసతి కల్పించి అనంతరం ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత విద్యార్హత సర్టిఫికెట్లు నకలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలు 83743 60175 నంబరులో తెలుసుకోవచ్చన్నారు.